

రోడ్లు వేసేదెప్పుడో? 8లో▸

మారుమూల గిరిజన తండాలు, ఆదివాసీ గూడేలకు నేటికీ రోడ్డు సౌకర్యం లేదు. ప్రభుత్వం బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా పనులు ప్రారంభం కాలేదు.

తిమ్మాపూర్ చెరువుకు గండి

భైంసారూరల్: రెండు రోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు మండలంలోని తిమ్మాపూర్ పెద్ద చెరువుకు గండి పడింది. వరద భైంసా – నిర్మల్ జాతీయ రహదారి మీదుగా పారుతోంది. దీంతో స్థానికులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

గరిష్టం/కనిష్టం
28.2/24.1

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. రుతుపవనాలు, అల్పపీడనం ప్రభావంతో జిల్లా అంతటా ఉరుములు, మెరుపులతో మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని వినతి



మంత్రి ఎర్రబెల్లిని కలిసిన రమణారావు

కుంటాల: ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద గ్రామాల్లో ఇటీవల నిర్మించిన సీసీ రోడ్లకు సంబంధించిన పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని మాజీ ఎంపీపీ అరుణారమణారావు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును కోరారు. ఈమేరకు వరంగల్‌లో మంత్రిని కలిసి వినతిపత్రం అందించారు. నిధుల విడుదలకు మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పల్లెప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న సుధీర్‌కుమార్

సోన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జెడ్పీసీఈవో సుధీర్‌కుమార్ అన్నారు. సోన్, వెల్మల్, గాంధీనగర్ గ్రామ పంచాయతీల పరిధిలో మంగళవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజేందర్‌తో కలిసి ఆయన పర్యటించారు. పరిశుభ్రతతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, ఫైలేరియా నుంచి కాపాడుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. మురికి గుంతల్లో ఆయిల్ బాల్స్ వేయించారు. అనంతరం పల్లె ప్రకృతి వనం, హరిత నర్సరీ, క్రీడా మైదానం, ఐకేపీ, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్‌రెడ్డి, ఎంపీవో ఖలీల్ హైమద్, ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్, కార్యదర్శులు స్వరూప, సంగీత, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సదర్మాట్‌కు పోటెత్తిన వరద



సదర్మాట్ వద్ద ఉధృతంగా గోదావరి వరద

ఖానాపూర్: ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు మండలంలోని మేడంపల్లి గ్రామంలోని సదర్మాట్ ఆనకట్టకు వరద పోటెత్తింది. గరిష్ట నీటి మట్టం 7.6 ఫీట్లు కాగా, ప్రస్తుతం 9.1 ఫీట్లలో వరద ఉంది. దీంతో 18,773 క్యూసెక్కుల నీరు గోదావరిలోకి వెళ్తోందని ఏఈఈ ఉదయ్ తెలిపారు. వరద పెరగడంతో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్నందున సందర్శకులను అనుమతించడం లేదు.

గడ్డెన్నవాగు నుంచి నీటి విడుదల

భైంసాటౌన్: భైంసా గడ్డెన్నవాగు ప్రాజెక్టు నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ఎగువన కురిసిన వర్షాలకు మంగళవారం ప్రాజెక్టుకు 6,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, అధికారులు ఒక గేటు ఎత్తి 8,450 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 358.70 మీటర్లు కాగా, 358.10 మీటర్ల నీటిమట్టం కొనసాగిస్తున్నారు.

స్వర్ణ ప్రాజెక్టు గేటు ఎత్తివేత

సారంగపూర్: ఎగువ ప్రాంతమైన మహారాష్ట్రలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి స్వర్ణ ప్రాజెక్టులోకి వరద పోటెత్తింది. అప్రమత్తమైన అధికారులు మంగళవారం తెల్లవారుజామున ప్రాజెక్టు ఒక గేటు ఎత్తి నీటిని స్వర్ణ నదిలోకి విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1183 అడుగులు(1.484) టీఎంసీలు కాగా ఒక్కసారిగా 3,500 క్యూసెక్కుల వరద రావడంతో అంతే మొత్తంలో నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రస్తుతం ప్రాజెక్టు నీటిమట్టం 1179.5 అడుగుల వద్ద స్థిరంగా ఉంచామని జేఈ మధుపాల్ తెలిపారు.



వానలు.. వ్యాధులు!

- పెరుగుతున్న దోమలు..
- నమోదవుతున్న డెంగీ కేసులు
- ఇళ్లు, హాస్టళ్లలోకి పాములు..
- పాముకాటుకు చిన్నారి మృతి
- పొంచి ఉన్న ముప్పు..



డ్రైడేపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

నిర్మల్:వానలు, వరదలతోపాటు ఈ సీజన్‌లో వ్యాధులు, ప్రమాదాలూ పొంచి ఉంటాయి. వారం రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. వరదలకు పాములు, విష పురుగులు కాలనీలు, ఇళ్లు, హాస్టళ్లలోకి వస్తున్నాయి. ఏపుగా పెరుగుతున్న పచ్చదనంతోపాటు ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయడం, నీరు నిల్వ ఉండటం దోమల వృద్ధికి కారణమవుతున్నాయి. రెండు రోజుల క్రితం జిల్లా కేంద్రంలో ఒక డెంగీకేసు నమోదైంది. నాలుగు రోజుల క్రితం కుభీర్ మండలంలోని కేజీబీవీ హాస్టల్‌లోకి పాము వచ్చింది. సోమవారం భైంసా మండలం హంపోలిలో ఏడేళ్ల చిన్నారి నిత్యను పాము కాటేసింది. ఖానాపూర్‌లో వర్షాలకు ఇళ్లు కూలాయి. ఇలా వరదలతోపాటు వ్యాధులు, ప్రమాదాలు కూడా పొంచి ఉన్నాయి. ముందు జాగ్రత్తలతో ముప్పు నుంచి బయటపడాలని వైద్యులు, అధికారులు సూచిస్తున్నారు.

దోమలతో డెంగీ..

కొన్నేళ్లుగా జిల్లాను డెంగీ వణికిస్తోంది. పట్టపగలు కుట్టే ఏడిస్ ఈజిప్టి దోమలతో ఇది వ్యాపిస్తోంది. జిల్లాకేంద్రంలో తాజాగా ఈ దోమకాటుతో ఒకరు డెంగీబారిన పడ్డారు. ఈసారి సీజన్‌లోనూ డెంగీ కేసులు మొదలైనట్లు స్పష్టమవుతోంది. తీవ్ర జ్వరం, నీరసం తదితర లక్షణాలతో ప్రాణాంతకంగానూ మారుతోంది. జిల్లా కేంద్రంలోనే బయటపడిందంటే గ్రామీణప్రాంతాల్లో మరిన్ని డెంగీ కేసులు ఉండే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు.

శుభ్రతతోనే దూరం..

వానాకాలం వ్యాధుల కాలంగా పిలుస్తుంటాం. ఈ సీజన్‌లో అజాగ్రత్త, అపరిశుభ్రత జ్వరాలకు దారితీస్తుంటుంది. ప్రధానంగా చుట్టూ ఉండే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఉంటుంది. డెంగీ కారక దోమలు పెరగకుండా ఉండాలంటే నీరు నిల్వ ఉంచొద్దు. వర్షపు నీరు నిల్వఉండే కుంటలు, గుంతల్లోనే వీటి సంతతి ఎక్కువగా పెరుగుతుంది. చెత్త, చెట్ల గుంపుల మధ్యలోనే పాములు ఎక్కువగా సంచరిస్తుంటాయి. ఈ సీజన్‌లో ఇలాంటి వాటినీ తొలగించాలి. పారిశుధ్య చర్యల కోసం పట్టణాల్లో మున్సిపాలిటీ, గ్రామాల్లో పంచాయతీ సిబ్బందికి సమాచారం ఇవ్వాల్సిందిగా జిల్లా అధికారులు సూచిస్తున్నారు.

పాములతో పరేషాన్..

ఈ చల్లని వాతావరణానికి పచ్చని చెట్లు తోడు కావడం, వర్షానికి వరదలు వస్తుండడంతో పాములు ఆరుబయట సంచరిస్తున్నాయి. కప్పలను వేటాడే క్రమంలోనూ ఇళ్ల సమీపంలో ఉండే కుంటలు, గుంతల వద్ద ఎక్కువగా సంచరిస్తూ ఉన్నాయి. ఇలాంటి సందర్భాల్లో అటువైపుగా వెళ్లే వాళ్లు పాముకాటుకు గురవుతున్నారు. హంపోలిలో ఇంట్లో నిద్రిస్తున్న చిన్నారి నిత్యను పాము కాటేయడంతో ఆస్పత్రికి తరలించే లోపే మరణించింది. కుభీర్‌లోని కేజీబీవీలోనూ పాము కలకలం రేపింది. ఇక్కడి ప్రాంగణంలో శనివారం రాత్రి ఇద్దరు విద్యార్థినులు కాళ్ల మధ్యలో నుంచి పాము వెళ్లడం ఆందోళన కలిగించింది. పాడుబడ్డ ఇళ్లు, చెత్తతో నిండిన ప్రాంతాలు, వ్యవసాయ క్షేత్రాల్లో పాముల సంచారం ఎక్కువగా ఉంటుంది.



చర్యలు తీసుకుంటున్నాం..

జిల్లా కేంద్రంలో డెంగీ దోమలు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నాం. కేసులు నమోదైన ప్రాంతాల్లో ఇప్పటికే నివారణ చర్యలను చేపట్టాం. పారిశుధ్య పనులపైనా దృష్టిపెట్టాం.
– సీవీఎన్.రాజు, మున్సిపల్ కమిషనర్, నిర్మల్

అధిక వర్షాలతో అప్రమత్తంగా



గడ్డెన్నవాగు ప్రాజెక్టును పరిశీలిస్తున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి
- భైంసా పట్టణం, మండలంలో సుడిగాలి పర్యటన

భైంసాటౌన్/భైంసారూరల్:వర్షాకాలం నేపథ్యంలో పరిసరాల్లో నీరు నిల్వకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అధికారులకు సూచించారు. భైంసా పట్టణంలో, భైంసా మండలంలోని సిద్దూర్, ఖథ్‌గాం గ్రామాల్లో మంగళవారం సుడిగాలి పర్యటన చేపట్టారు. ముందుగా స్థానిక గడ్డెన్నవాగు ప్రాజెక్టు చేరుకుని పరిశీలించారు. అధిక వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ప్రాజెక్టు అధికారులకు సూచించారు. అక్కడి నుంచి ఆటోనగర్ బైపాస్ వంతెన వద్ద పరిశీలించారు. వివేకానందచౌక్‌లో నిర్మిస్తున్న నాలా పనులు పరిశీలించారు. అలాగే పట్టణంలోని పలు డ్రెయినేజీలను పరిశీలించి, మురుగునీటి పారకానికి ఇబ్బందులు లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు సూచించారు. తర్వాత సిద్దూర్ గ్రామంలో పర్యటించారు. అంతర్గత రోడ్లు, పారిశుధ్య నిర్వాహణ, అంగన్‌వాడీకేంద్రం, పాఠశాల భవనం, గ్రామపంచాయతీ భవనాల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తర్వాత ఖథ్‌గాం గ్రామానికి వెళ్లి నర్సరీని పరిశీలించారు. గ్రామ పంచాయతీ భవన నిర్మాణం పూర్తవుతుందని తెలిపారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, డీఎల్పీవో శివకృష్ణ, ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి, సర్పంచులు మారుతి, రాజు ఉన్నారు.

ప్రాణ నష్టం జరుగకుండా చర్యలు తీసుకోవాలి

లోకేశ్వరం: వర్షాలు, వరదలకు ప్రాణనష్టం జరుగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి సూచించారు. మండలంలోని పంచగుడి గోదావరి ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌ను మంగళవారం పరిశీలించారు. అధికారులతో మాట్లాడారు. గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్నందున అటువైపు ప్రజలు, పశువులు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు అలర్ట్‌గా ఉండాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ సరిత, ఎంపీడీవో సోలమాన్ రాజ్, ఏపీవో జగన్నాథ్, ఈసీ అనిల్, టీఏ మంజుల, సర్పంచ్ ఎల్లన్న, ఆర్‌ఐ బాలకృష్ణ ఉన్నారు.

టీకాల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

- డీఎంహెచ్‌వో ధనరాజ్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ధనరాజ్

నిర్మల్‌చైన్‌గేట్:వ్యాధి నిరోధక టీకాల వివరాలు యు–విన్ యాప్‌లో నమోదు చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్ సూచించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో యు–విన్ యాప్‌పై వైద్య సిబ్బందికి మంగళవారం ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఇకపై వ్యాధి నిరోధక టీకాలకు సంబంధించిన సేవలను యు విన్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. జిల్లాలో ఆగస్టు నెల నుంచి మూడు నెలలపాటు మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ పిల్లవాడికి, గర్భిణికి వ్యాధినిరోధక టీకాలు అందేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ నయనరెడ్డి, సామాజిక ఆరోగ్య అధికారి గిరిబాబు, ఆరోగ్య విస్తరణ అధికారులు వేణుగోపాలరావు, చంద్రశేఖర్, దుష్యంత్‌రెడ్డి, జిల్లాలోని వైద్యాధికారులు, ఆరోగ్య పర్యవేక్షకులు, డేటాఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న సెంట్రల్ రైల్వే డీఆర్ఎం



అమ్మవారిని దర్శించుకుంటున్న లోకేశ్ వైష్ణవ్

భైంసా: బాసర శ్రీజ్ఞానసరస్వతి అమ్మవారిని సౌత్ సెంట్రల్ రైల్వే డీఆర్ఎం లోకేశ్ వైష్ణవ్ మంగళవారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు.

బాధిత కుటుంబానికి మిత్రబృందం చేయూత



ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలు అందిస్తున్న మిత్రబృందం

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో 1998–99 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు తోటి మిత్రుడి కుటుంబానికి అరుణోదయ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేయూత అందించారు. ఈ బ్యాచ్‌కు చెందిన గడ్డి శ్రీనివాస్ ఇరాక్‌లో రెండేళ్ల క్రితం గుండెపోటుతో మృతిచెందాడు. బాధిత కుటుంబానికి చేయూత అందించాలనే ఉద్దేశంతో మిత్ర బృందం ఆధ్వర్యంలో విరాళాలు సేకరించి రూ.55 వేలను గడ్డి లక్ష్మి పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఈ పత్రాలను సీఐ రవీందర్‌నాయక్ చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. శ్రీనివాస్ కూతురు సహస్రను సైతం 1 నుంచి 10వ తరగతి వరకు విజేత హైస్కూల్‌లో చదివిస్తామని పాఠశాల డైరెక్ట ర్ మదిరె శ్రీనివాస్ హామీ ఇచ్చారు. మరో మిత్రుడు నిర్మల్ ఎంఎం డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ అడిదెల రాజేశ్వర్ బాధిత చిన్నారికి 1 నుంచి 10వ తరగతి వరకు నోట్‌బుక్స్, స్టేషనరీ అందిస్తానని పేర్కొన్నా రు. నాయిని సంతోష్, మామిడాల సుధాకర్, శ్రీనివాస్, గంగాప్రసాద్, లక్ష్మీరాజం, రాజేంద్రప్రసాద్, మల్లేష్, సుమన్, రంజిత్ పాల్గొన్నారు.

వైకల్యాన్ని జయించాలి



విద్యార్థులకు బ్యాగులు అందిస్తున్న విజయలక్ష్మి

నిర్మల్‌రూరల్: వైకల్యం శరీరానికే కానీ, మనసుకు, జ్ఞానానికి కాదని, వైకల్యం ఉందని బాధపడకుండా దానిని జయించేలా ముందుకెళ్లి భవిష్యత్తుకు పూలబాటలు వేసుకోవాలని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. దివ్యాంగశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సక్షమ్, విద్యాశాఖ తరఫున గత విద్యాసంవత్సరం టెన్త్, ఇంటర్‌లో ప్రతిభ కనబర్చిన దివ్యాంగులను భవిత కేంద్రంలో మంగళవారం సత్కరించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు పింఛన్లు, సదరం సర్టిఫికెట్లు అందజేస్తున్నామన్నారు. దివ్యాంగశక్తి ఫౌండర్ పంచగుడి మహేశ్ విద్యార్థులకు బ్యాగులు, హ్యాండ్‌వాష్, క్లీనర్లు అందజేశారు. విలీన విద్య సమన్వయకర్త యస్.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యాశాఖ తరఫున మొత్తం 40 మంది విద్యార్థులకు ఎస్కార్ట్ సాయంతో పదో తరగతి పరీక్షలు నిర్వహించామన్నారు. విద్యార్థుల కోసం ఎస్కార్ట్ అలవెన్సు, ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్, స్టైఫండ్ ఇస్తామన్నారు. ఆలింకో వారి సహకారంతో వైకల్య నిర్ధారణ శిబిరం నిర్వహించి 285 మందికి అవసరమైన ఉపకరణాలు అందిస్తామన్నారు. సక్షమ్ గౌరవ అధ్యక్షుడు నూకల విజయ్‌కుమార్, పీడియాట్రిస్ట్ స్వప్న, హెచ్ఎం మోసిన్ ఫాతిమా, ఏపీడీ ప్రసాద్, భవిత కేంద్ర నిర్వాహకులు నాగరాజు, రాకేష్, వివిధ మండలాల ఐఆర్పీలు పాల్గొన్నారు.

ఓటింగ్‌కు పోటెత్తేలా..

- ప్రజలకు అవగాహన కార్యక్రమాలు
- జిల్లా వ్యాప్తంగా 13 మొబైల్ వ్యాన్లు
- మూడుచోట్ల ఈవీఎం, వీవీప్యాట్ అవగాహన కేంద్రాలు
- మూడు నెలలపాటు కొనసాగనున్న డ్రైవ్



వీవీ ప్యాట్‌ల గురించి వివరిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్లను చైతన్యవంతం చేసేందుకు ఎన్నికల అధికారులు వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తాజాగా మొబైల్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం, వీవీ ప్యాట్లపై సంచార వాహనాల ద్వారా నిర్మల్, ముధోల్, ఖానాపూర్ నియోజకవర్గాల పరిధిలో రోజుకోచోట అవగాహన కల్పిస్తున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ఈ ఏడాది చివరలో జరగనున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో కలెక్టర్ వరుణ్‌రెడ్డి దిశానిర్దేశంతో జిల్లా అధికార యంత్రాంగం సన్నద్ధమయింది. ఇప్పటికే ఇంటింటికీ బీఎల్‌వోలు సర్వే చేపట్టి ఓటర్ల జాబితాను తప్పులు లేకుండా రూపొందించడంలో నిమగ్నమయ్యారు.

ప్రజల అనుమానాలు నివృత్తి చేసేలా..

జిల్లా కేంద్రంలోని నూతన కలెక్టర్ కార్యాలయం పక్కన ఏర్పాటు చేసిన గోదాములో ఈవీఎంలను భద్రపరచారు. వివిధ పార్టీల సమీక్షంలో మొదటి విడత తనిఖీలు చేపట్టి వారికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై ప్రజల్లో సందేహాలను తొలచి, ఓటింగ్ శాతం పెంచేందుకు కేంద్రాలు వారీగా యంత్రాల వినియోగంపై అవగాహన కల్పించనున్నారు. దీనికోసం జిల్లాలో మూడు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతీ గ్రామంలో ఓటర్లకు ఈవీఎం యంత్రాల పనితీరుపై అవగాహన కల్పించేందుకు 13 ప్రత్యేక వాహనాలు సిద్ధం చేశారు. వాటిలో ఈవీఎం యంత్రాలను ఏర్పాటు చేసి అవగాహన కల్పించనున్నారు. కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాలులో ఓటర్లకు చైతన్యం చేసేందుకు ఈవీఎం యంత్రాన్ని ఏర్పాటు చేశారు. నిర్మల్, భైంసా ఆర్డీవో కార్యాలయంలో ఈవీఎం అవగాహన కేంద్రాలు ఏర్పాటు చేశారు.

పోలింగ్ కేంద్రాల వారీగా అవగాహన..

జిల్లాలోని 396 పంచాయతీలు, 3 మున్సిపాలిటీల పరిధిలో ఓటింగ్ యంత్రాలపై ఈనెల 20 నుంచి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పోలింగ్ కేంద్రాల్లో స్థానిక అధికారులు, బీఎల్‌వోలు పర్యటించి మాక్ ఓటింగ్ నిర్వహిస్తున్నారు. ఓటు హక్కు ఉపయోగాన్ని వివరిస్తూ, ఓటు ఎలా వేయాలో తెలియజేస్తూ.. ఓటింగ్ యంత్రాలపై ఉన్న అపోహలను తొలగిస్తున్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రానికి యంత్రాలను తీసుకెళ్లి ఓటు ఎలా వేయాలో ప్రయోగాత్మకంగా చూపిస్తున్నారు.

జిల్లాలో 13 మొబైల్ వ్యాన్లు..

నిర్మల్ జిల్లాలో 13 మొబైల్ వ్యాన్లతో ఈవీఎం లలో ఓటింగ్ ఎలా వేయాలన్న అంశంపై ప్రజల్లో అవగాహన కోసం ఏర్పాట్లు చేశారు. ఈ మొబైల్ వ్యాన్లలో ఓ పోలీసు శాఖ నుంచి ఒకరు, రెవెన్యూ శాఖ నుంచి ఒకరు ఉంటారు. గ్రామ పంచాయతీల వద్ద మొబైల్ వ్యాన్లను నిలిపి అక్కడికి ఓటర్లను సమీకరించి ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ పనితీరుపై అవగాహన కల్పిస్తారు. ఓటింగ్ మిషన్ మీట ఎలా నొక్కాలి. ఓటు నమోదు కోసం బీప్ వచ్చే తీరు.. నమోదు తరువాత ధ్రువీకరణ ఎలా చేసుకోవాలన్న విషయంపై ఓటరుకు అవగాహన కల్పిస్తారు. ఓటర్ల సమీకరణ కోసం గ్రామ పంచాయతీ పరిధిలోని సెల్ఫ్ హెల్ప్ గ్రూపులు, యువ జన సంఘాలు, ఇతరత్రా సంస్థల నుంచి సాయం తీసుకోవడానికి ఏర్పాట్లు చేశారు.

పోలింగ్ శాతం పెంచాలని..

జిల్లాలో 6,71,369 మంది ఓటర్లకు గాను 3,24,990 మంది పురుషులు, 3,46,325 మంది మహిళలు, 54 మంది ఇతరులు నమోదయ్యారు. కాగా అత్యధిక అక్షరాస్యత కలిగిన పట్టణాల్లో ప్రతి ఎన్నికల్లో పోలింగ్ శాతం తక్కువగా ఉంటోంది.

నియోజకవర్గాల వారీగా పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల వివరాలు..

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	స్త్రీలు	ట్రాన్స్‌జెండర్లు
నిర్మల్	302	1,10,538	1,22,696	14
ముధోల్	311	1,13,251	1,19,092	27
ఖానాపూర్	305	1,01,201	1,04,537	13

సోపానాల ఆధారంగా పాఠాలు బోధించాలి

- రాష్ట్ర పరిశీలకులు సువర్ణ వినాయక్



ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న సువర్ణ వినాయక్

నిర్మల్ రూరల్: ఉపాధ్యాయులు వివిధ సోపానాల ఆధారంగా విద్యార్థులకు పాఠాలు బోధించాలని తొలిమెట్టు రాష్ట్ర పరిశీలకులు సువర్ణ వినాయక్ సూచించారు. జిల్లా కేంద్రంలోని వశిష్ట డిగ్రీ కళాశాలలో జరుగుతున్న మూడు రోజుల తొలిమెట్టు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించారు. ఉపాధ్యాయులు తొలిమెట్టు శిక్షణను సక్రమంగా వినియోగిస్తే ఆశించిన ప్రమాణాలు అందుకోవచ్చన్నారు. ఉపాధ్యాయులకు పనిభారం తగ్గించేలా, సోపానాల ఆధారంగా బోధించేందుకు సహాయకారిగా ఉండేలా హ్యాండ్ బుక్‌లను ప్రభుత్వం రూపొందించిందని తెలిపారు. విద్యాభివద్ధికి తోడ్పడేలా, విద్యార్థులు నేర్చుకుంటున్నామన్న భావన కలిగించేలా వర్క్ బుక్స్ రూపొందించామన్నారు. హ్యాండ్ బుక్, వర్క్‌బుక్‌లను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్త నర్సయ్య, రిసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ వరుణ్‌రెడ్డిని కలెక్టరేట్‌లో కలిసి జిల్లాలో అమలు చేస్తున్న, నిర్వహిస్తున్న విద్యా కార్యక్రమాలపై చర్చించారు.

వారం రోజుల్లో భూసమస్య పరిష్కారానికి చర్యలు



మంత్రి ఐకేరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

లక్ష్మణచాంద:న్యూకంజర్ గ్రామస్తుల భూసమస్యను వారం రోజుల్లో పరిష్కారమయ్యేలా చూస్తానని మంత్రి ఐకేరెడ్డి హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. ధరణి పోర్టల్ అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి న్యూకంజర్ గ్రామంలోని భూములు పోర్టల్‌లో ప్రభుత్వ భూములుగా నమోదు చేశారు. రెండున్నరేళ్లుగా రైతులు భూముల అమ్మడం, కొనడం జరుగడం లేదు. రైతుబంధు, రైతుబీమా పథకాలకు నోచుకోవడం లేదు. దీంతో రాష్ట్ర అటవీ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని మంగళవారం క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల ఇబ్బందులు తెలుసుకున్న రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి న్యూకంజర్ గ్రామ భూముల సమస్యను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకవెళ్లి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు.

రోడ్లు వేసేదెప్పుడో..?

- గిరి గూడేలకు, తండాల బీటీ రోడ్లకు రూ.42 కోట్లు
- 2022 నవంబర్ 14న నిధులు మంజూరు చేసిన గిరిజన సంక్షేమశాఖ
- ఎనిమిది నెలలు గడుస్తున్నా ప్రారంభం కాని పనులు
- గిరిజనుల దారి కష్టాలు యథాతథం


మాన్కపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు దుస్థితి


గిరిజాయి గ్రామ సమీపంలో వాగు దాటుతున్న గిరిజనులు

బజార్‌హత్నూర్: జిల్లాలో మారుమూల అటవీ ప్రాంతాల్లోని గిరిజన గూడేలు, తండాలకు రవాణా సౌకర్యాలు మెరుగుపరుచుటకు బీటీ రోడ్ల నిర్మాణానికి రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ద్వారా బోథ్ నియోజకవర్గంలోని 40 రోడ్ల నిర్మాణానికి రూ.42.29 కోట్లు నిధులను మంజూరు చేసింది. అయితే 8 నెలలు గడుస్తున్న ఏ గ్రామానికి రోడ్డు నిర్మాణం పనులు చేపట్టలేదు. వేసవి కాలం దాటిన పనులు ప్రారంభం కాకపోవడంతో గిరిజనుల దారి కష్టాలు మరో ఏడాది భరించక తప్పేపరిస్థితి కనబడటం లేదు.

రోడ్ల నిర్మాణంలో జాప్యం ఎందుకో...

బోథ్ నియోజకవర్గంలోని గిరిజన గూడేలకు, తండాలకు బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరైన టెండర్ల ప్రక్రియ పూర్తి కాకపోవడంతో రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. జిల్లాలోని అటవి ప్రాంతాలకు ఆనుకొని ఉన్న గిరిజనగూడేలు, తండాలు దశాబ్దాల క్రితమే ఏర్పడిన ఇప్పటివరకు ఎలాంటి రోడ్డు సౌకర్యం లేక గిరిజనులు విద్య, వైద్యానికి దూరమవుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే ఈ గిరిజన గ్రామాలకు సైకిల్ కూడా వెళ్లలేని పరిస్థితి. 2022 నవంబర్‌లో బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌ను కలిసి మారుమూల ప్రాంత గిరిజనుల దుస్థితిని విన్నవించారు. దీంతో బోథ్ నియోజకవర్గంలోని 7 పాత మండలాల పరిధిలోని గిరిజన గ్రామాలకు బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. అందులో బోథ్ మండలంలోని నాలుగు రోడ్ల నిర్మాణానికి రూ.3.9కోట్లు, బజార్‌హత్నూర్ మండలంలో 5 రోడ్లకు రూ.7.14కోట్లు, ఇచ్చోడ మండలంలోని 9 రోడ్లకు రూ.6.38 కోట్లు, నేరడిగొండ మండలంలోని 9 రోడ్లకు రూ.5.72 కోట్లు, తాంసి మండలంలోని 5 రోడ్లకు రూ.6.72 కోట్లు, తలమడుగు మండలంలోని మూడు రోడ్లకు రూ.8.48 కోట్లు, గుడిహత్నూర్ మండలంలోని 5 రోడ్లకు రూ.3.95 కోట్లు మొత్తం 7 మండలాల పరిధిలోని 62 గ్రామాలకు 40బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.42.29 కోట్ల నిధులు మంజూరు చేశారు. దీంతో ఆ సమయంలో సంబంధిత గ్రామాల గిరిజనులు ఆనందం వ్యక్తం చేశారు. కానీ అధికారుల నిర్లక్ష్యమో, గిరిజనుల దురదృష్టమో ఏమో కాని ఎనిమిది నెలలు గడుస్తున్నా ఎక్కడ రోడ్డు నిర్మాణం జరగలేదు.

వర్షాకాలం గిరిజనులకు కష్టకాలమే...

ప్రస్తుతం ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో గిరిజన గ్రామాల నుంచి మండల కేంద్రాలకు చేరుకునే పరిస్థితి లేదు. వర్షాలకు వాగులు వంకలు పొంగి పొర్లడం, దారులన్నీ బురదమయం కావడంతో గిరిజనులకు ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్ల సౌకర్యం లేక ఎవరైన అనారోగ్యం బారినపడితే చెట్ల పసర్లే దిక్కు. అత్యవసర పరిస్థితిలో రోగులను ఆసుపత్రికి తీసుకువెళ్లాలన్నా అంబులెన్సు, ఇతర వాహనాలు ఆ గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి. గర్భిణులు ఆస్పత్రికి వెళ్లాలన్నా ఎడ్ల బండ్లే దిక్కు. చదువుకోవడానికి విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లలేని దుస్థితి.

కలగానే రోడ్డు నిర్మాణం..



మా గ్రామం ఏర్పడి ఐదు దశాబ్దాలు గడుస్తున్నా ఇప్పటికీ రోడ్డు నిర్మాణం జరగలేదు. మా గ్రామం నుంచి మండల కేంద్రానికి వెళ్లాలంటే 12 కిలో మీటర్లు బురదలో నడవాల్సిందే. వర్షాకాలం గ్రామ సమీపంలో కడెం వాగు దాటాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని దాటాల్సిన పరిస్థితి. ఎన్ని ప్రభుత్వాలు వచ్చిన మా దారి కష్టాలు తీరడం లేదు.

– కుమ్ర సంగీత, సర్పంచ్, గిరిజాయి

టెండరు ప్రక్రియ పూర్తికాగానే పనులు ప్రారంభిస్తాం

బోథ్ నియోజకవర్గంలోని గిరిజన గూడేలకు, తండాలకు గిరిజన సంక్షేమ శాఖ ద్వారా రూ.42.29 కోట్లు నిధులు మంజూరైనప్పటికీ టెండర్లు పూర్తి కాలేదు. కొన్ని రోడ్ల నిర్మాణానికి అటవీశాఖ అడ్డంకులు ఏర్పడ్డాయి. అటవీశాఖ నుంచి అనుమతులు లభించిన తర్వాత టెండరు ప్రక్రియ పూర్తి చేస్తాం. రోడ్ల నిర్మాణాలు వర్షాకాలం ముగిసిన తర్వాత ప్రారంభించనున్నాం.

– సంతోష్ దీఈ, ఐటీడీఏ, ఉట్నూర్

క్లుప్తంగా

జాతీయస్థాయి కార్మిక సమాఖ్య సమావేశానికి జిల్లా వాసి

నిర్మల్ ఖిల్లా: జాతీయస్థాయి కార్మిక సంఘాల సమాఖ్య సమావేశానికి నిర్మల్ జిల్లాకు చెందిన పరికిపండ్లస్వదేశ్‌కు ఆహ్వానం లభించింది. ఈనెల 26, 27 తేదీల్లో చెన్నైలో నిర్వహించనున్న జాతీయస్థాయి సమావేశానికి తెలంగాణకు చెందిన ఇద్దరు కార్మిక సంఘాల నాయకులకు ఆహ్వానం అందింది. ఇందులో నిర్మల్ జిల్లాకు చెందిన ప్రవాసమిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పరికిపండ్లస్వదేశ్‌తో పాటు, కరీంనగర్ జిల్లా అధ్యక్షురాలు బూత్కూరి కాంతా ఉన్నారు. స్విట్జర్లాండ్ రాజధాని జెనీవా కేంద్రంగా పనిచేస్తున్న బిల్డింగ్ అండ్ వుడ్ వర్కర్స్ ఇంటర్నేషనల్ (బీడబ్ల్యూఐ) అనే గ్లోబల్ యూనియన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ జాతీయ సమావేశానికి ఇద్దరు కార్మిక సంఘాల నాయకులను నామినేట్ చేసింది. వీరు గల్ఫ్ దేశాలలో వలస కార్మికుల సమస్యలు, జాతీయ అంతర్జాతీయ వలసలు, నిర్బంధ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, లింగసమానత్వం తదితర అంశాలపై ప్రసంగించనున్నారు. క్షేత్రస్థాయిలో వలస భవన నిర్మాణ రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను నివేదిక రూపంలో బీడబ్ల్యూఐ దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు స్వదేశ్ చెప్పారు.

ముగ్గురు మట్కా జూదరుల అరెస్టు


పోలీసుల అదుపులో మట్కా జూదరులు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని తాంసి బస్టాండ్ ప్రాంతంలో మట్కా జూదరులను సీసీఎస్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. సమాచారం మేరకు సీసీఎస్ పోలీసులు దాడులు చేసి ముగ్గురు మట్కా జూదరులను పట్టుకున్నారు. మట్కా నిర్వహిస్తున్న బొక్కల్‌గూడకు చెందిన వసీమ్, మహారాష్ట్రలోని కిన్వట్‌కు చెందిన కనక సంతోష్, ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన షేక్ ఖలీల్‌లను అరెస్టు చేశారు. వీరి నుంచి మూడు సెల్‌ఫోన్లు, రూ.4530 నగదుతో పాటు మట్కా చీటీలను స్వాధీనం చేసుకున్నారు. టూటౌన్ పోలీసు స్టేషన్‌లో వీరిని అప్పగించగా, ఎస్సై అశోక్ కేసు నమోదు చేశారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి


మృతి చెందిన గేదె

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అర్లి (బి) గ్రామానికి చెందిన రైతు బుక్క రవీందర్‌కు చెందిన గేదె విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. వివరాల ప్రకారం.. రోజు మాదిరిగానే సోమవారం గేదె పశువుల మందలో మేతకు వెళ్లింది. నిషాన్‌ఘాట్ శివారు ప్రాంతంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నేలకు రెండు ఫీట్ల ఎత్తులో ఉండడంతో అది తగిలి విద్యుత్ షాక్ గురై అక్కడిఅక్కడే మృతి చెందింది. దాని విలువ రూ.50వేల వరకు ఉంటుందని బాధితుడు వాపోయాడు.

మీ సేవ నిర్వాహకులపై విచారణ


విచారణ చేపడుతున్న అధికారులు

గుడిహత్నూర్: మండలంలోని మన్నూర్ మీసేవాకు చెందిన స్టేషనరీపై మండల కేంద్రంలోని ఆన్‌లైన్ సెంటర్ నిర్వాహకుడు నకిలీ కుల ధృవీకరణ పత్రం తయారు చేసి ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ సంఘటన పై తహసీల్దార్ సంధ్యారాణి పోలీసులకు, మీసేవ సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం మీసేవ ఈ డీఎం బండి రవి, తహసీల్దార్ సంధ్యారాణి సమక్షంలో విచారణ చేపట్టారు. నకిలీ ధృవీకరణ పత్రం స్టేషనరీ మన్నూర్ మీ సేవ కేంద్రానికి కేటాయించడం జరిగిందని నిర్ధారించారు. దీనిపై గుడిహత్నూర్ ఆన్‌లైన్ సెంటర్‌లో ఎలా ప్రింట్ చేశారని వాకబు చేశారు. సదరు మీ సేవా కేంద్రానికి ఉన్న లాగిన్ వివరాలు సేకరించారు. దీంతో పాటు గుడిహత్నూర్ మీ సేవా కేంద్రానికి సంబంధించి కొన్ని ఫిర్యాదులు ఉన్నాయని నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లారు. మీ సేవా నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని సీఎస్‌సీ సెంటర్ల నిర్వాహకులు సైతం హద్దులు మీరి వ్యవహరించవద్దని హెచ్చరించారు. పూర్తి విచారణ చేపట్టి కలెక్టర్‌కు నివేదించడం జరుగుతుందని తెలిపారు. విచారణలో టీఎస్‌టీఎస్ డీఎం నర్సింహారావ్, ఈ సేవా జిల్లా కోఆర్డినేటర్ ఠాకూర్ రఘువీర్ సింగ్ ఉన్నారు.

గంగానదిలో మాజీ మంత్రి అస్తికలు


కాశీలో పూజలు నిర్వహిస్తున్న సంజీవ్ రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల మృతిచెందిన మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సి.రాంచంద్రారెడ్డి అస్తికలను మంగళవారం ఆయన అల్లుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంజీవ్‌రెడ్డి కాశీలోని గంగానదిలో వదిలారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రత్యేక పూజలు జరిపారు.

విద్యార్థుల సర్కస్ ఫీట్లు


దారిలో ఏర్పాటు చేసిన గ్రీల్స్‌ను పట్టుకొని పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు సర్కస్ ఫీట్లు తప్పడం లేదు. మంగళవారం ఉదయం కురిసిన భారీ వర్షానికి పాఠశాల వెళ్లేదారిలో వర్షం నీటితో నిండిపోయింది. ప్రధానగేటు నుంచి పాఠశాల వరకు దాదాపుగా ఐదు వందల మీటర్ల పొడవున మోకాలిలోతు నీరు నిలిచి ఉండడంతో వి ద్యార్థులకు సర్కస్ ఫీట్లు తప్పడం లేదు. దారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన ఇనుపగ్రీల్స్‌ను పట్టుకొని పాఠశాలకు చేరుకుంటున్నారు. మరికొందరు మోకాళ్లోతు నీటిలోనడుచుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

బిడ్డపై మురిపెం తీరకముందే..

- రిమ్స్‌లో బాలింత మృతి
- కన్నీరుమున్నీరైన కుటుంబీకులు


మృతిచెందిన బాలింత


పుట్టిన బిడ్డతో కుటుంబీకులు

ఆదిలాబాద్‌టౌన్/ఇంద్రవెల్లి: నవమాసాలు మోసి.. పురుటినొప్పులతో తల్లడిల్లి పండంటి బిడ్డకు జన్మనిచ్చిన ఓ తల్లి ఆ బిడ్డ మురిపెం చూడకుండానే అనంత లోకాలకు పయనమైన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. పెళ్లయిన రెండేళ్ల తర్వాత గర్భం దాల్చడంతో తల్లి గారి, అత్తవారింట్లో సంతోషాలు వ్యక్తమయ్యాయి. తొమ్మిది నెలలు నిండడంతో జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో రెండు రోజుల క్రితం ప్రసవం కోసం చేర్పించారు. మంగళవారం ఉదయం మగబిడ్డకు జన్మనిచ్చిన కొన్ని గంటల్లోనే మృత్యువాత పడడంతో ఆనందంగా కాస్తా ఆవిరైపోయింది. దీంతో ఇరు కుటుంబాల్లో విషాదం నెలకొంది. కుటుంబీకులు కన్నీరుమున్నీరవుతూ పుట్టిన బిడ్డను చూసి విలపించారు.

సాధారణ కాన్పు అయినప్పటికీ..

ఇంద్రవెల్లి మండలం మర్కగూడకు చెందిన గైక్వాడ్ అశోక్–రంజన దంపతుల నాలుగో సంతానం సొనాలి కాంబ్లే (22) రెండేళ్ల క్రితం నార్నూర్ మండలంలోని బొప్పపూర్ గ్రామానికి చెందిన నానేశ్వర్‌తో వివాహమైంది. కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. గర్భం దాల్చిన తర్వాత ప్రసవం కోసం తల్లిగారి ఇంటికి వచ్చింది. పురుటినొప్పులు రావడంతో ఆదివారం కుటుంబీకులు రిమ్స్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. మంగళవారం ఉదయం 5.30 గంటల సమయంలో సాధారణ కాన్పు ద్వారా ప్రసవం జరిగింది. మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఆ సమయంలో ఆమె ఆరోగ్యంగానే ఉందని కుటుంబీకులు, వైద్యులు తెలిపారు. అయితే మంగళవారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల సమయంలో సొనాలికి ఫిట్స్ వచ్చినట్లు చెప్పారు. ఆ సమయంలో ఇద్దరు వైద్యులతో పాటు జూనియర్ డాక్టర్లు అందుబాటులో ఉన్నారు. చికిత్స అందిస్తున్న సమయంలోనే పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ డ్యూటీలో ఉన్న ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, జూనియర్ డాక్టర్లను పిలిచి బాలింత మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అమియోట్రిక్ ఫ్లూయిడ్ ఎంబాలిజం (ఊపిరితిత్తుల సమస్య)తో మృతిచెంది ఉండొచ్చని వైద్యులు తెలిపారు.

మాతృత్వపు అనుభూతి పొందకుండానే..


సొనాలి కాంబ్లే (ఫైల్)

నవ మాసాలు మోసిన తర్వాత మాతృత్వపు అనుభూతి పొందకుండానే కాటికి వెళ్లింది. బిడ్డ ఆలనాపాలన, తల్లి ప్రేమకు దూరమయ్యాడు. తల్లిదండ్రులు తమ కూతురుకు సంతానమైందన్న ఆనందం అంతలోనే ఆవిరైంది. దీంతో ఇరు కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబీకులతో పాటు బంధువుల రోదనలు మిన్నంటాయి. చిన్నారిని చూస్తూ కంటతడి పెట్టిన తీరు అందరిని కలచివేసింది.

పాత తహసీల్దార్ కార్యాలయంలో అగ్నిప్రమాదం


మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పాత తహసీల్దార్ కార్యాలయంలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. వివరాలలోకి వెళ్తే.. ఇందులోని తహసీల్ కార్యాలయాన్ని ఆర్డీవో ఆఫీస్‌కి తరలించారు. ఈ భవనాన్ని మున్సిపల్‌కు అప్పగించారు. అయితే ఇక్కడ సమీకృత మార్కెట్‌ను నియమించడానికి మున్సిపల్ అధికారులు బిల్డింగ్ కూల్చివేత పనులను ప్రారంభించారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం కార్యాలయం నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన చుట్టుపక్కల వారు సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. కార్యాలయంలోని పనికి రాని రికార్డ్స్, ఫర్నీచర్ పూర్తిగా దగ్ధమైంది. దీనికి సంబంధించిన వివరాలను సంబంధిత తహసీల్దార్ సుభాష్‌ను సంప్రదించగా మా ఆఫీస్ కు సంబంధించిన పూర్తి రికార్డులను తీసుకున్న తర్వాత, మున్సిపల్‌శాఖకు అప్పజెప్పడం జరిగిందని, ఈ అగ్ని ప్రమాదంలో ఎలాంటి రికార్డులు కాలిపోలేవని, మా రికా ర్డులు భద్రంగానే ఉన్నాయని పేర్కొన్నారు. ఈ విషయంపై మున్సిపల్ డీఈని సంప్రదించగా.. బిల్డింగ్‌కు సంబంధించిన ఐరన్ రాడ్‌లను గ్యాస్ కట్టర్‌తో కట్ చేస్తుండగా చిన్నచిన్న నిప్పు రవ్వలతో అగ్ని ప్రమాదం సంభవించినట్లు తెలిపారు. దీంతో ఎటువంటి నష్టం వాటిల్లలేదన్నారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం బిల్డింగ్‌ను జేసీబీతో కూల్చివేశారు.

స్తంభం పైనుంచి పడి లైన్‌మన్‌కు గాయాలు

తాంసి: విద్యుత్ స్తంభంపై మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడి లైన్‌మన్ తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని అర్లి(టి) సబ్‌స్టేషన్ పరిధిలో లైన్‌మెన్‌గా దినేష్ విధులు నిర్వహిస్తున్నాడు. దినేష్ గోవింద్‌పూర్ గ్రామ శివారులో విద్యుత్ స్తంభంపై మరమ్మతులు చేస్తుండగా జారి పడ్డాడు. దీంతో చేతికి, కాళ్లకు గాయాలయ్యాయి. వెంటనే గ్రామస్తులు చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు.

రెండు గేదెల చోరీ

తానూరు: మండలంలోని బోంద్రట్ గ్రామంలో ఓ రైతుకు చెందిన రెండు గేదెలు చోరీకి గురైనట్లు ఎస్సై జె.రాహుల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... బోంద్రట్ గ్రామానికి చెందిన రైతు సోన్‌ఖేడ్ సురేశ్ ఈ నెల 23వ తేదీన రాత్రి నాలుగు గేదెలను తన పెరటిలో కట్టివేసి ఇంటికి వెళ్లాడు. 24వ తేదీన రెండు గేదెలు కనిపించకుండా పోయాయి. ఎంత వెతికినా ఆచూకీ కనిపించకపోవడంతో మంగళవారం సాయంత్రం ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ ఉద్యోగులు


బ్యాగు అందిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు, ఎస్సై

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఆర్టీసీ ఉద్యోగులు తమ నిజాయితీని చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో నుంచి మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు సూపర్ లగ్జరీ సర్వీస్ హైదరాబాద్‌కు బయలుదేరింది. నిర్మల్‌లో మల్లెబోయిన శివ అనే ప్రయాణికుడు బస్సులోనికి ఎక్కాడు. హైదరాబాద్ సుచిత్ర బస్సు స్టాప్ వద్ద తన బ్యాగును బస్సులోనే మర్చిపోయి దిగిపోయాడు. బస్సు ఎంజీబీఎస్ బస్ స్టేషన్‌కు చేరుకున్న అనంతరం బస్సులో బ్యాగును గుర్తించిన ఆదిలాబాద్ డిపో డ్రైవర్ అర్జున్, కండక్టర్ రాజులు ఎంజీబీఎస్ స్టేషన్ ఎస్సై హనుమంతుకు వివరాలను తెలియజేశారు. ప్రయాణికుని వివరాలను సేకరించిన అనంతరం ఆయనకు బ్యాగును అందజేశారు. బ్యాగులో రెండు లక్షల విలువ గల రెండు ల్యాప్ టాప్‌లు ఉన్నాయని, ఆర్టీసీ ఉద్యోగులు నిజాయితీతో బ్యాగును అప్పగించడంపై ప్రయాణికుడు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ యశ్వంత్, కానిస్టేబుల్ ఆర్ వివిఎస్ నాయక్ తదితరులున్నారు.

సాత్నాల రెండు గేట్లు ఎత్తివేత



జైనథ్: ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని సాత్నాల ప్రాజెక్ట్‌లోకి ఇన్‌ఫ్లో కొనసాగుతుండటంతో మంగళవారం అధికారులు రెండు గేట్లు ఎత్తారు. సుమారుగా 3500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండటంతో మధ్యాహ్నం వరకు రెండు గేట్లు ఎత్తి 3500క్యూసెక్కుల ఔట్‌ఫ్లోని కొనసాగించారు. కాగా 24వేల ఆయకట్టు, 1.24టీఎంసీ నీటి నిల్వ సామర్థ్యం, 286.5 మీటర్ల ఎఫ్‌ఆర్‌ఎల్ కలిగిన సాత్నాల ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం 284.60మీటర్ల ఎత్తులో 0.824 టీఎంసీ నీటి నిల్వలు ఉండగా, ఇంకా 960క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.

గుండెపోటుతో యువకుడి మృతి


నవీన్ (ఫైల్)

తలమడుగు: మండలంలోని ఉండం గ్రామానికి చెందిన బోండ్ల నవీన్ (23) గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాలు ప్రకారం... నవీన్ డిగ్రీ పూర్తిచేశాడు. మంగళవారం ఉదయం ఇంట్లో ఒక్కసారిగా కిందపడిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. ఉన్న ఒక కుమారుడు మృతిచెందడంతో కుటుంబబీకుల రోదనలు మిన్నంటాయి.

